క్లుప్తంగా

గృహప్రవేశానికి హాజరైన మాజీ డిప్యూటీ సీఎం



లిల్లీఆనందన్‌ను చిత్రపటాన్ని అందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం పంచాయతీ సర్పంచ్ ఆనంద్ లిల్లీ నూతనంగా నిర్మించిన ఇంటి ప్రవేశ కార్యక్రమానికి ఆదివారం మాజీ డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి హాజరయ్యారు. మండల పరిధిలోని వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలతో కలసి నూతన నివాసానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీస్సులు అందజేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ పుష్పప్రకాష్, ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, అనురేఖ, నాయకులు పుత్తూరు కేశవరెడ్డి, లోకిదాస్, మనోహర్, చిన్నబ్బరాజు, షణ్ముగరెడ్డి, కుట్టి, ప్రేమ్‌కుమార్, మేగవర్ణం యాదవ్, మండల పరిధిలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయల పంపిణీ

వడమాలపేట(విజయపురం): వడమాలపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్ర మం నిర్వహించారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఏఓ విజయకుమార్ మాట్లాడుతూ సోమవారం నుండి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రబీ సీజనుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. వేరుశనగ 30 కేజీల బస్తా విత్తన శుద్ధి మందుతోపాటు 1800 రూపాయలకు రైతులకు అందజేస్తామన్నారు. అలాగే ఉద్దులు(మినుములు)నాలుగు కేజీల బ్యాగు 392 రూపాయలకు, నువ్వులు రెండు కేజీలు సబ్సిడీ పోను 202 రూపాయలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పెద్దపీట



మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం: గ్రామాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. మండల సర్వసభ్య సమావేశాన్ని ముద్దుకుప్పం ఎంపీటీసీ సిద్ధయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన సిద్ధయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం కల్పించాలని అన్నారు. ఇటీవల గ్రామ సభలో గుర్తించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అపార్ కార్డుల జారీ విషయంలో పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని తెలిపారు.

అపరిశుభ్రంగా బలిజకండ్రిగ



బలిజకండ్రిగలో అపరిశుభ్రత

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో జాతీయ రహదారి పక్కనే ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన చెందుతోంది రోడ్డు ఇరువైపులా పారిశుధ్యం లోపించడంపై పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సచివాలయానికే పరిమితమవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

గ్రామకంఠం భూములకు రిజిస్ట్రేషన్

తవణంపల్లె: మండలంలో గ్రామకంఠం భూములను అనుభవంలో ఉన్న వారు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తవణంపల్లె తహసీల్దార్ సుధాకర్ స్పష్టం చేశారు. మండలంలో చాలా మంది ప్రజలు గ్రామకంఠంలో ఉన్న భూములు రిజిస్ట్రేషన్ కోసం వీఆర్ఓ, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి సంతకాలతో కూడిన సర్టిఫికెట్ తేవాలని రిజిస్ట్రేషన్ అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో రెవెన్యూ కార్యాలయానికి తిరిగి అసహనానికి గురవుతున్నారు. రిజిస్ట్రేషన్ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామకంఠంలో ఉన్న భూమిని వారి రికార్డుల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. దీనిపై ప్రజలకు ఎలాంటి అపోహలు వద్దని సూచించారు. మండలంలో కోర్టులో జరుగుతున్న భూవివాదాలకు సంబంధించిన భూములు మినహా ఎలాంటి భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు ప్రాధానత్య ఇచ్చి పరిష్కరిస్తామన్నారు.

పురపాలికకు పన్ను గండం

- పంతొమ్మిదేళ్లుగా పన్ను వసూళ్లలో చివరి స్థానం
- అభివృద్ధికి ఆటంకంగా మారిన వైనం



నగరి: మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు పన్ను గండం పురపాలక సంస్థను వీడడం లేదు. 2005వ సంవత్సరం మే 28వ తేదీన నగరి, కొత్తపేట, కీళపట్టు, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, సత్రవాడ, చింతలపట్టెడ, నగరిపేట, టీఆర్.కండ్రిగ, కరకంతాపురం, నెత్తం కండ్రిగ, కాకవేడు పంచాయతీలు కలిసి నగరి మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. 2005–06 ఏడాది పంచాయతీ పన్నునే కొనసాగించిన అధికారులు 2006–07న మున్సిపల్ నిబంధనల ప్రకారం చదరపు అడుగుల లెక్కన పన్ను లెక్కించే ప్రక్రియను ప్రారంభించారు. నగరి పంచాయతీ స్థాయి నుంచి మున్సిపల్ స్థాయికి ఎదగడంతో పన్ను విధింపు కూడా పెరిగింది. పెరిగిన మున్సిపల్ పన్ను ప్రజలను ఆగ్రహానికి లోనయ్యేలా ఉండడంతో మున్సిపాలిటీ వద్దు.. రద్దు చెయ్యండన్న నినాదాన్ని తెచ్చింది. అది కాస్తా రాజకీయ రంగు పులుముకోవడంతో ప్రజలు పన్ను కట్టకుండా భీష్మించుకుని కూర్చున్నారు. ఆపై పలు ప్రభుత్వాలు మారాయి. కమిషనర్లూ మారారు. ప్రజల్లో అవగాహన తేవడానికి ప్రయత్నించారు. బకాయిదారులకు నోటీసులు ఇవ్వడం, బకాయిలకు వేసే వడ్డీలో రాయితీలు ఇవ్వడం ప్రారంభించారు. మరోవైపు ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పన్ను చెల్లింపు తప్పనిసరి చేశారు. ఈ చర్యలతో పన్నుల వసూళ్లలో కొంతమేరకు మార్పు వచ్చింది. అయితే పూర్తి స్థాయిలో ప్రజల్లో మార్పు రాలేదు. ఒకవైపు మొండి బకాయిదారులకు మాత్రం పన్ను పేరుకుపోయి వడ్డీలతో కలిసి తడిసి మోపెడైంది.

పన్ను బకాయిలు రూ.4.68 కోట్లు

మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్నుకు సంబంధించి 14671 అసెస్‌మెంట్‌లు ఉండగా వాటి ద్వారా ప్రస్తుత ఏడాదికి రావాల్సిన పన్ను రూ.3.16 కోట్లు, నీటిపన్నుకు సంబంధించి 5723 అసెస్‌మెంట్లు ఉండగా వాటి ద్వారా రావాల్సిన పన్ను రూ.68.58 లక్షలు అంటే ఏడాదికి పన్నుల ద్వారా రూ.3.84 కోట్లు వసూలు రావాలి. అయితే ఇప్పటి వరకు వసూలైన ఆస్తి పన్ను రూ.1.60 కోట్లు మాత్రమే. నీటి పన్ను రూ.15.65 లక్షలు మాత్రమే. ఈ ఏడాదికి పన్నుల ద్వారా ఇంకా వసూలు కావాల్సిన బకాయిలు రూ.2.08 కోట్లు ఉంది. ఇలా మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి పేరుకు పోయిన బకాయిలు రూ.2.59 కోట్లు ఉన్నాయి. ఈ లె క్కన మున్సిపాలిటీకి ఉన్న పన్ను బకాయిలు రూ.4.68 కోట్లు. ఇలా పన్నులు సకాలంలో వసూలు కాకపోవడంతో సాధారణ నిధుల లోటు ఏర్పడి ము న్సిపాలిటీ అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది.

కోట్లలో మున్సిపల్ బకాయిలు

మున్సిపాలిటీ ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా కోట్లలోనే ఉంది. మున్సిపాలిటీ చెల్లించాల్సిన విద్యుత్ బిల్లు రూ.6.70 కోట్లుగా ఉంది. మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనులకు సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సిన బిల్లులు కూడా అధికంగా ఉన్నాయి. దీంతో మున్సిపల్ అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది.

పన్నుల వసూలుకు ప్రత్యేక చర్యలు



పన్నుల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పన్ను కట్టకుంటే వారికి భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను వివరిస్తున్నాం. పన్ను కట్టడానికి ముందుకు వస్తున్నారు. పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు నోటీసులు అందిస్తున్నారు. ఆస్తి పన్నులో 38 శాతం, నీటి పన్నులో 8.45 శాతం పురోగతికి తెచ్చాం. పూర్తి స్థాయిలో పన్నులు వసూలైతే మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో సహకారంగా ఉంటుంది.

– కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ

నగరి ప్రజలకే నా జీవితం అంకితం




మాజీ మంత్రి ఆర్కే రోజా కేక్ తినిపిస్తున్న కరుణాకర రెడ్డి

మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : నియోజకవర్గ ప్రజలకే నా జీవితం అంకితమని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. ఆమె జన్మదిన వేడుకలను తన నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి, నగరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ దేవుని ఆశీర్వాదంతో నగరి నియోజకవర్గ ప్రజల మధ్య తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. తన రాజకీయ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని తెలిపారు. ఈ క్రమంలో తనకు రాజకీయ దారి చూపిన కరుణాకర రెడ్డిని, తనకు పూర్తి సహకారం అందించిన జగనన్నను, భర్త సెల్వమణి, తన అన్నదమ్ములు, నగరి ప్రజలను ఎన్నటికీ మరువనని ఉద్ఘాటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల అండదండలు ఉన్నంత వరకు ఏ దుష్టశక్తి ఏమీ చేయలేదని, తన రాజకీయ జీవితాన్ని ప్రజలకే అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు, విజయపురం, నింద్ర, వడమాలపేట నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే ముఖ్యం

– రేపటి ఆత్మీయ సమావేశానికి తరలిరండి



నాగరాణి

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీకి పూర్వ వైభవం తీసుకరావాలన్న సంకల్పంతో పార్టీ అధిష్టానం ప్రక్షాళనకు సిద్ధమైనట్లు ఎంపీపీ నాగరాణి అన్నారు. ఈ క్రమంలోనే శ్రీరంగరాజపురం మండలంలోని కొత్తపల్లెమిట్టలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం వెదురుకుప్పంలో ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్ఆర్ సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, దారుణాలు అమానుషమన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామన్నారు. ఇదే ఆలోచనతో పార్టీ శ్రేణులను సంసిద్ధం చేసేందుకు మంగళవారం పెద్ద ఎత్తున సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ ఏకమై ప్రజాకంటక ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ముందుకు రావాలన్నారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. నాయకులు, కార్యకర్తలకు భరోసాగా తాము ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై పోరాటాలు చేసేందుకు ఏకం కావాలన్నారు.

బహిరంగ సభకు తరలిరండి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ మణి

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే వైఎస్ఆర్ సీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ బహిరంగ సభను విజయవంతం చేయాలను మండల కన్వీనర్ మణి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో ఈ నెల 19వ తేదీన ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహించునున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. మీడియా సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలప్ప, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు జనార్దన్, బాబు, లోకనాథరాజు, రామనాథరెడ్డి, మహేష్, సుబ్బనాయుడు, జయ, గోవిందయ్య, రామచంద్రయాదవ్, మణి పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు మధురం



38 ఏళ్ల తరువాత ఒక్కటైన పూర్వ విద్యార్థులు

– కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమావేశం

కార్వేటినగరం: అనంతపురం, నెల్లూరు, కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు చెందిన డైట్ విద్యార్థులు 38 ఏళ్ల తరువాత మళ్లీ కలుసుకున్నారు. కార్వేటినగరం డైట్ కళాశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో టీటీసీ చదువుకున్న విద్యార్థులు ఆదివారం డైట్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో 100 మంది విద్యార్థులు కలసి ఒక్క సంవత్సరంపాటు టీటీసీ చదువుకున్నారు. కార్వేటినగరానికి చెందిన అప్పటి టీటీసీ ఛాత్రోపాధ్యాయులు గాజుల నాగేశ్వరరావు శేఖర్, ఆనంద్ మురుగన్ స్నేహితుల వివరాలని సేకరించి, వారిని ఒకటి చేసే ప్రయత్నంలో విజయం సాధించారు. చివరకు 80 మందిని కలుసుకునేలా చేయగలిగారు. వీరంతా ఆటల పాటలతో సందడి చేశారు. చివరిగా గురువులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. మృతి చెందిన గురువుల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు కళాశాల ఆవరణలో స్టేజీ నిర్మాణానికి రూ.1.75 లక్షల చెక్కును కళాశాల ప్రిన్సిపల్ శేఖర్‌కు అందించారు.

హైస్కూల్ ప్లస్ కాదు.. మైనస్సే

నియోజకవర్గ కేంద్రమైన జీడీనెల్లూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పేరుకే ఉంది. లోపల అంతా మైనస్‌లే దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్లస్ హైస్కూల్లో దాదాపు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదే పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు కూడా బోధన అందిస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా అభివృద్ధిలో మాత్రం శూన్యం. పాఠశాల ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలు, ఏపుగా పెరిగిపోయిన చెట్లతో అడవిని తలపిస్తోంది. పాఠశాలలోని తరగతి గదులు సైతం చిన్నపాటి వర్షాలకే ఉరుస్తున్నాయి. నియోజకవర్గస్థాయి, మండల స్థాయికి సంబంధించిన ఎలాంటి అధికారిక కార్యక్రమాలైనా ఇదే పాఠశాల్లో నిర్వహిస్తున్నారు. ఎందరో అధికారులు, ప్రజా ప్రతినిధులు పలుమార్లు పాఠశాలకు విచ్చేసినా అధ్వాన్న స్థితిలో ఉన్న ఈ పాఠశాల భవనాలను గమనించకపోవడం దౌర్భాగ్యం. – గంగాధరనెల్లూరు



పరిశుభ్రత లేని మరుగుదొడ్లు

- అధ్వాన్నంగా తరగతి గదులు
- దుర్గంధభరితంగా టాయిలెట్లు
- మధ్యాహ్న భోజనంలో లోపించిన శుభ్రత
- వరండాలోనే విద్యార్థులకు వడ్డింపు
- మంచినీటి సౌకర్యం కూడా లేని పాఠశాల
- పిచ్చి మొక్కలు, ఏపుగా పెరిగిన చెట్లు
- పట్టించుకోని అధికారులు

40 సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల భవనాలు దుస్థితికి చేరుకున్నాయి. ఈ పాత భవనానికి కొన్ని సంవత్సరాల క్రితం పైపై మెరుగులతో కొన్ని కొన్ని రిపేర్లు చేయించారు. అయినా పాఠశాల గోడల వెనక భాగం పూర్తిగా ధ్వంసమైంది. వర్షానికి పై కప్పు పెచ్చులూడి పోతోంది. పాచి పట్టి పోవడంతో కిటికీలు సైతం పూర్తిగా పనికిరాకుండా పోయాయి. పెట్టుడు కిటికీలతో కాలం సాగిస్తున్నారు.

దుర్గంధభరితం

200 మందికి పైగా విద్యార్థినులు ఉన్న ఈ పాఠశాలలో మరుగుదొడ్లు దుర్గంధభరితంగా మారాయి. మరుగుదొడ్లకు డోర్లు కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల చుట్టూ ఏపుగా పెరిగిపోయిన చెట్లతో విద్యార్థులకు భయాందోళనలు తప్పడం లేదు. నీటి సౌకర్యం కూడా లేకపోవడం దురదృష్టకరం. నీరు లేకపోవడంతో నెలలు తరబడి శుభ్రం చేయని ఆ మరుగుదొడ్లను ఉపయోగించుకుంటూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు పట్టించుకుని త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని పాఠశాల విద్యార్థులు కోరుతున్నారు.

అపరిశుభ్ర భోజనం

మధ్యాహ్న భోజన పథకానికి కూడా ఒక నిర్దీత గది లేదు. ఆరుబయటే భోజనం వండుతున్నారు. అలాగే వడ్డింపు కూడా ఒక వరండాలోనే నేలపై పెట్టుకుని వడ్డిస్తున్నారు. శుభ్రత లేకుండా విద్యార్థినీ విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం పథకంలో కూడా చాలా ఇబ్బందులు ఉన్నాయి.

తాగునీటి సమస్య

పాఠశాల ఆవరణలో గతంలో పూర్వ విద్యార్థుల సహాయంతో మంచినీటి ట్యాంకును నిర్మించారు. శుభ్రపరిచి, ఆధునీకరించిన కొద్ది రోజులకే కుళాయిలు విరిగిపోయాయి. ట్యాంకు లోపల పాచి పట్టి పోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పాఠశాలలో 400 మంది విద్యార్థులు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు త్వరితగతిన జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనాలను ఆధునీకరించి, మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో తిరిగి నిర్మించి, మంచినీటి సదుపాయం కల్పించాల్సి ఉంది.





ఆరుబయటే వరండాలో మధ్యాహ్న భోజనం వడ్డింపు, కుళాయిలు విరిగిపోయి, అపరిశుభ్రంగా ఉన్న మంచినీటి ట్యాంకు, చిన్నపాటి వర్షానికి ఉరుస్తూ కిటికీలు ధ్వంసమైన గోడలు

సాగుకు సన్నద్ధం

అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. ఖరీఫ్‌లో రుతుపవనాలు ఆశాజనకంగా వర్షించకున్నా.. తాజాగా కురుస్తున్న వర్షాలు వ్యవసాయ పనులకు సహకరించాయి. దీంతో రైతులు రబీ సాగుకు పొలం పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో పనుల సాగింపునకు కూలీల కొరత వేధిస్తుండడం వారిని ఇబ్బందికి గురి చేస్తోంది.

– విజయపురం

విజయపురంలో వరి నాటు వేస్తున్న కూలీలు



- జోరుగా వ్యవసాయ పనులు
- రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతన్న

ఖరీఫ్‌లో జూన్, జూలై నెలల్లో కొంత మేరకు నిరాశ పరిచిన వర్షాలు ఆగస్టు రెండో వారంలో ప్రారంభమై రోజూ ఎక్కడో ఒక చోట కురుస్తుండడంతో రబీ సాగు పనులు ఊపందుకున్నాయి. కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో రబీ ఆశలు కొంత మేరకు చిగురించాయి. నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో వరి, 5 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇప్పుడిప్పుడే వర్షాలు సహకరిస్తుండడంతో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. కొన్ని చోట్ల సాగు నీటి కొరత కారణంగా ఆలస్యంగా పనులు సాగుతున్నా..మిగిలిన గ్రామాల్లో వరి, వేరుశనగ సాగు ఊపందుకుంది. మున్ముందు వర్షాలు కురుస్తాయన్న ఆశతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు.

వేధిస్తున్న కూలీల కొరత

ప్రస్తుతం వర్షాలు కురిసి కాలువలు, గుంటల్లో నీరు ఉండడంతో వ్యవసాయ సాగు ఊపందుకుంది. మండలంలోని రైతులు ఒకే సారి సాగుకు సిద్ధమవుతుంటే కూలీల కొరత ఏర్పడింది. పొలాల్లో గట్లు వేసేందుకు, వరి నాట్లు వేసేందుకు, ఆకు తీసేందుకు రైతు కూలీల అవసరం ఎక్కువగా ఉంది. కూలీల కొరత కారణంగా కుటుంబ సభ్యులతో కలిసి రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు.




వరి నాటుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు, వరి నాటుకు పొలంలో వరి నారు

కూలీలు దొరకడం లేదు

ఏక కాలంలో పనులు ప్రారంభం కావడంతో కూలీల కొరత ఉంది. కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనుల్లో ఉన్నాం. అలాగే పెట్టుబడులు కూడా పెరిగాయి. వ్యవసాయానికి ప్రభుత్వం నంచి సహకారం తగ్గింది.

– గోవిందస్వామి, విజయపురం

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎంపీపీ నాగరాణి అన్నారు. ఆదివారం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మారడంతో అధికారులు తమతో మాట్లాడేందుకే భయపడుతున్నారని తెలిపారు. మినీగోకులాల కేటాయింపు అధికారులు ఇష్టమొచ్చినట్లు వ్యవహరించారని తెలిపారు. మండలంలో తాము ప్రజాప్రతినిధులుగా ఉన్నామన్న అంశాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. కనీసం ప్రొటో కాల్ కూడా పాటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు రాజకీయ జోక్యాన్ని తగ్గించుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ రమేష్‌బాబును సభ్యులు నిలదీశారు. ఫ్రీహోల్డ్‌లో తలెత్తిన సమస్యలు, శ్మశానాలకు భూములు కేటాయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అమర్‌నాథ్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీలు మురళీరెడ్డి, రాధిక, విజయ, మునిచంద్రారెడ్డి, సుజాత, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధునికి విరాళాల వెల్లువ

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి పలువురు దాతలు ఆదివారం నగదు విరాళాలు సమర్పించుకున్నారు. ఐరాల మండలం చినకంపల్లికి చెందిన చైతన్యరెడ్డి, రోహిత్‌రెడ్డి బాలక్రిష్టారెడ్డి జ్ఞాపకార్థం గోసంరక్షణ ట్రస్టుకు రూ. 5,01,116 విరాళం చేశారు. అలాగే పలమనేరుకు చెందిన దాత కృష్ణయ్య నిత్యాన్నదానానికి రూ.1,00,116 ఆలయ అధికారులకు అందజేశారు. యూఎస్ఏకు చెందిన మహేష్‌కుమార్ అన్నదానం ట్రస్టుకు రూ.లక్ష నగదు విరాళం అందించారు. గుంటూరు జిల్లాకు చెందిన ఒబులిశెట్టి వెంకట రామకృష్ణ రూ.1,00,116 విరాళంగా ఆలయ అభివృద్ధికి సమర్పించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.